
# పోలీస్ స్టేషన్



**మా** నిర్భయ్‌నగర్‌కాలనీ– హైదరాబాద్‌లోని మిగతా కాలనీలతో పోల్చిచూస్తే చాలా ప్రశాంతకరమయినా కాలనీగా భావించవచ్చు. (శాయిరామ్, జనార్ధన్, రంగారెడ్డి, మాకాలనీలోనే ఉంటున్నప్పటికీ కూడా) అయితే ఉండుండి ఓ దొంగల ముఠా ఏదొక ఇంటిని దోచుకోవటం (మేము రాజీకుదుర్చుకున్న దొంగలముఠాకాదు) వెంటనే పోలీసులు వచ్చి మమ్మల్నందరినీ పోలీస్‌స్టేషన్‌కి తీసుకుపోయి నానాప్రశ్నలూ వేయటం, ఇవి మాత్రం తప్పటంలేదు. అదీగాక ఆ మధ్య మరోగొడవయింది. మా కాలనీ కల్చురల్ సెక్రటరీ పార్వతీదేవి ఓసారి ఆటోలో కాలనీ కొచ్చింది. మీటర్ చార్జీ నలభై రూపాయలు అయింది. పైన ఇంకో ఐదు రూపాయలివ్వాలని వాడు పేచీపెట్టాడు దాంతోమేమంతా రంగంలోకి దిగాల్సి వచ్చింది. వాడిని పోలీస్‌స్టేషన్‌కు లాక్కెళ్ళాలని అనుకున్నాంగానీ అంతదూరం వెళ్ళటానికి బద్ధకం వేసింది. దానిబదులు వాడికి ఐద రూపాయలు ఇవ్వటమే తేలికయిన పద్ధతని గ్రహించి– వాడిని వదిలించుకున్నాము.

ఇలాంటివే మరిన్ని చెదురుమదురు సంఘటనలు జరిగాక మా కాలనీకొక పోలీస్‌స్టేషన్ ఉండటం ఎంతో అవసరమన్న అభిప్రాయాని కొచ్చాము. ఇలా అభిప్రాయానికొచ్చామో

లేదో- దొరికిందే చాన్స్ అని ఆ ఆదివారం నాటికల్లా కాలనీ మీటింగ్ ఏర్పాటు చేశాడు శాయీరామ్. నేను మీటింగ్ చేరుకునేసరికే ఉధృతంగా కొనసాగుతోందది. శాయీరామ్ ఆవేశంగా మాట్లాడుతున్నాడు. "మన కాలనీలో తక్కువ జనాభా ఏంలేదు, రెండు పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయదగినంత జనాభా ఉంది. కనుక ఒకటయినా వెంటనే నెలకొల్పాలని మనం ఇప్పుడే హోమ్‌శాఖామంత్రిగారిని కోరాలి. పోలీస్‌స్టేషనుంటే మనకెన్నో విధాల సౌకర్యం కలుగుతుంది. మనకాలనీ చుట్టుప్రక్కల దుకాణాల వాళ్ళు తూకాల్లో మోసంచేస్తే మనం వెంటనే పోలీస్‌ని పిల్వవొచ్చు. ఆటోవాళ్ళుమీటర్‌మీద ఎక్స్‌ట్రా ఇమ్మని పేచీలు పెట్టరు. రౌడీలు తాగి కాలనీలోకి రారు. దొంగలభయం అసలే ఉండదు-"

"అవును- అవును" అంటూ తప్పట్లు కొట్టారందరూ.

"రెండేళ్ళ క్రితం నేను మాణింగ్‌వాక్ కెళ్ళేప్పుడు ఒకడు నా మెడలో గొలుసు తెంచుకుపోయాడు. పోలీస్‌స్టేషన్ దగ్గర్లో ఉంటే వెంటనే వాడిని పట్టించేదానిని కదా-" అంది పార్వతమ్మ.

"కాలనీ వెనుక ఉన్న "ఇందిరానగర్"లో మాట్లాడితే ప్రొద్దుట్నుంచీ సాయంత్రం వరకూ, వరుసగా స్పీకర్‌లో తెలుగు సినిమా తాలూకూ బూతుపాటలు వేయకుండా పోలీస్‌కి కంప్లెయింట్ ఇవ్వవచ్చు-" అంది రాజేశ్వరి.

అప్పటికప్పుడే అందరం కలసి హోమ్‌మినిష్టర్ గారికో అర్జీ తయారుచేశాం- మర్నాడు అందరం శెలవుపెట్టి ఓచిన్నసైజు ఊరేగింపుగా బయల్దేరి హోమ్‌మినిష్టర్‌గారి దగ్గరకెళ్ళాం! మా కాలనీపేరు చూడగానే- వెంటనే- బయటికొచ్చి మమ్మల్ని కలుసుకున్నారాయన.

"మీ కాలనీ గురించి న్యూస్‌పేపర్స్‌లో చదివాను. దొంగలనందరినీ మీ కాలనీకి ఆహ్వానించి వాళ్ళతో రాజీకుదుర్చుకున్నది మీరే కదూ?" అడిగారాయన.

"అవును సార్ మేమే!" అన్నాడు రంగారెడ్డి గర్వంగా.

"చాలా సంతోషం! ఇలా ప్రజలే సమస్యల్ని పరిష్కరించుకుంటే ప్రభుత్వం ఎంతో సంతోషిస్తుంది. దేశమంతా కూడా మీ కాలనీని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉంది- ఇంతకూ ఇప్పుడు ఏం పనిమీద వచ్చారు?" ఎంతో అభిమానంతో అడిగారు.

"అదేసార్- మా కాలనీ సిటీకి బయటుంది. అందుకని మా ఏరియాలో ఓ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే-"

ఆయన మా కోరిక విని షాకయ్యాడు.

ఆయన వెంటనే తన సెక్రటరీ వేపు తిరిగాడు.

"అదేంటోయ్ సెక్రటరీ! ప్రజలు రైల్వేస్టేషన్ కావాలని అడుగుతారు. లేదా రేడియోస్టేషన్, బస్‌స్టేషన్, ఫైర్‌స్టేషన్ అలాంటివి అడగటం గురించి విన్నాం కానీ ఇలా పోలీస్‌స్టేషన్ కావాలని అడగటం వినలేదే?"

"అవున్సార్! ఇలాంటి వింత కోరిక కోరటం నేనూ ఇదే మొదటిసారి చూస్తున్నాసార్!"

"పోనీ ఇంకెవరికయినా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తామని మనం హామీలిచ్చామా?"

"లేద్సార్! అసలు 'పోలీస్‌స్టేషన్' కావాలి అని అడిగినవారెవ్వరూ ఇంతవరకూ లేరు సార్! వీళ్ళే మొట్టమొదటిసారిగా అడుగుతున్నాడు-"

ఆయన ఆశ్చర్యపోయారు.

"నిజమే! ప్రజలు పోలీస్‌స్టేషన్లు కావాలని ఎందుకడగరసలు? స్కూళ్ళు కావాలనీ, అస్పత్రులు కావాలనీ, ఫ్యాక్టరీలు కావాలనీ- ఇలా ఎన్నో కావాలని అడుగుతారు గాని"

"అదే నాకూ అర్థం కావటం లేద్సార్-"

అయినా ప్రజలు అడిగిందేమీ మనం ఎలాగూ చేయలేం కాబట్టి ఇలాంటివి చేసేస్తే మనం ఏదో పొడిచేస్తున్నామని పెద్ద పబ్లిసిటీ వస్తుంది.

"సరే! మీ నిర్భయ్‌నగర్‌కాలనీకి వెంటనే పోలీస్‌స్టేషన్ ఇస్తాను-" అన్నారు మినిష్టర్ గారు హ్యాపీగా.

అందరం తప్పట్లు కొట్టాం.

"హోమ్ మినిష్టర్‌గారికీ-" అని అరచాడు శాయీరామ్.

"జై" అరచాము అందరం. ఇది జరిగిన వారం రోజులకే మా కాలనీ చివర ఉన్న ఓ ఇంట్లో ఓ కొత్త పోలీస్‌స్టేషన్‌కి ప్రారంభోత్సవం జరిగింది. ఆ మీటింగ్‌కి కాలనీ వారందరం హాజరయ్యాం. కాలనీ శెక్రెట్రీ హోదాలో రంగారెడ్డి కూడా వేదిక మీద కూర్చున్నాడు.

పోలీస్ అధికారి ఒకరు పోలీస్‌స్టేషన్ గురించి, తను సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న రోజుల్లో- పద్దెనిమిది గంటల్లో- ఓ హంతకుడిని పట్టుకొన్న కేస్ గురించీ గంటన్నరసేపు వర్ణించాడు.

ఆ తరువాత రంగారెడ్డి మాట్లాడాడు.

"ఈ ఉత్సవానికి విచ్చేసిన గౌరవనీయులయిన కాలనీవారికీ మరియు పోలీసు అధికారులకూ మా స్వాగతం! ఇవ్వాళ మన కాలనీకి నిజంగా పర్వదినం, ఎందుకంటే ఇవాళ మన కాలనీలో మన కోసం ప్రత్యేకంగా ఒక పోలీస్‌స్టేషన్ ప్రారంభించారు గనుక! అసలు పోలీస్‌లంటే ఎవరు? మన స్నేహితులు! ఎన్నో విధాల మనకు సహాయం చేసేవారు. ఇంగ్లీష్ పిక్చర్స్‌లో పోలీసుల ప్రజలకు ఎన్నో విధాలుగా సహాయపడటం మనందరం చూస్తూనే ఉంటాం! అదేదో ఇంగ్లీష్ పిక్చర్లో- ఆ సినిమా పేరు నాకు గుర్తురావటం లేదు-

ఒక పోలీస్, ఒక సామాన్య పౌరుడితో ఎంతో మర్యాదగా మాట్లాడే సీన్– నన్నెంతో కదిలించివేసింది–"

జనార్ధన్ ఠక్కున లేచాడు మా మధ్యలో నుంచి.

"ఆ సినిమాపేరు హెల్ రైడర్స్–" అంటూ గుర్తుచేశాడు.

"కరెక్ట్! హెల్ రైడర్స్– అందులో ఆ పోలీస్ పోలీస్ అయుండి కూడా ఒక సామాన్య పౌరుడితో ఎలాంటి తిట్లూ, ఆ మర్యాదాలేకుండా రెండు నిమిషాలు మాట్లాడతాడు. అంతేకాదు. ఆ పౌరుడి జేబులో డబ్బు ఉన్నట్లు తెలిసినా– ఒక పైస కూడా తీసుకోడు–" అందరూ తప్పట్లు కొట్టారు.

"కనుక సోదరులారా! ఇంగ్లీష్ పిక్చర్స్‌లో పోలీసులు ఇంత ఉదాత్తంగా కూడా ప్రవర్తిస్తూంటారు– కనుక మనం కూడా–"

"ఇంకచాలు–" వెనుకనుంచి మా కాలనీ స్టూడెంట్ ఎవరో అరిచారు.

"కనుక మనం కోరగానే ఈ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన హోంమంత్రిగారికీ, పోలీస్ అధికారులకూ నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను–" అంటూ వేదిక దిగాడతను.

ఆ తరువాత కాలనీ కమిటీ ఏర్పాటు చేసిన తేనీటి విందు జరిగింది. కొత్త పోలీస్‌స్టేషన్ తాలూకూ ఇన్‌స్పెక్టర్ మా అందరినీ అప్యాయంగా పలుకరిస్తూ ఎవరికెలాంటి ఇబ్బంది కలిగినా తను సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటానని హామీఇచ్చాడు. అందరితోనూ కరచాలనం చేశాడు. "మేము మీ సేవకులం"అన్నాడు చిరునవ్వుతో. అందరం అంతమంచి ఇన్‌స్పెక్టర్ దొరికినందుకు ఆనందించాం.

ఆ మర్నాడు సాయంత్రం మేము ఆఫీస్ నుంచి కాలనీకి చేరుకునేసరికి కాలనీ అంతా బోసిపోయినట్లు కనిపించింది. సాయంత్రమయ్యేసరికి కాలనీ మధ్యలో చేరి 'ముచ్చట్లు' చెప్పుకునే ఆడాళ్ళెవరకూ మాకు కనిపించలేదు.

"చాలా ఆశ్చర్యంగా ఉందే! వర్షం పడుతున్నాకూడా లెక్కచేయకుండా ఇక్కడ సమావేశమయి ఏవేవో విషయాలు మాట్లాడుకుంటూండే వాళ్ళుకదా?" అన్నాడు శాయిరామ్.

అందరం దగ్గర్లో ఉన్న మా ఇంటికెళ్ళాం.

"ఇవ్వాళ మీ లేడీస్ సమావేశం లేదేమిటి?" ఆశ్చర్యంగా మా ఆవిడనడిగాము.

"భలేవారే! చదవేస్తే ఉన్న మతి కూడా పోయిందట! ఓ పోలీస్‌స్టేషన్ ఉండగా– ఆడవాళ్ళను ఇళ్ళల్లో నుంచి బయటకు రమ్మంటారా." అందామె చిరుకోపంతో. మేమంతా మొఖాలు చూచుకొన్నాం.

"అదేమిటి– మనకాలనీకి 'రక్షణ' కోసమేగా మనం పోలీస్‌స్టేషన్ అడిగింది!" అన్నాడు జనార్ధన్ ఆశ్చర్యంగా!

"చాల్లెండి! రమీజాబీ కేస్ సంగతి మర్చిపోయామనుకుంటున్నారేమిటి?" అందరం ఉలిక్కిపడ్డాము.

"అవ్! మనం మరచినాం ఆ సంగతి!" అన్నాడు యాదగిరి. అందరి మొఖాల్లోనూ కొద్దిక్షణాలపాటు అశాంతి తాండవం చేసింది.

"అప్పటి పోలీసులు వేరు– ఇప్పటి పోలీసులువేరు" అన్నాడు శాయీరామ్ పోలీస్ డిపార్టుమెంట్‌ని సమర్ధిస్తూ.

"అప్పటిసంగతి సరే– మరి మొన్నేగా ఒక సర్కిలినిస్పెక్టర్ ఒక కేస్ రిజిష్టర్ చేయడానికొచ్చిన లేడీ ఇంటికి అర్ధరాత్రి రేప్ చేయబోయాడు?" ఆ కొశ్చెన్‌తో మేము సైలెంటయిపోయాం. అయినాగానీ మా కాలనీ పోలీసుల్ని సమర్ధించక తప్పలేదు.

"మొన్న పాపం ఆ ఇన్‌స్పెక్టరూ, కానిస్టేబులూ, ఎంతచక్కగా, మర్యాదగా అభిమానంతో మాట్లాడారు? చాలా మార్పువచ్చింది పోలీసుల్లో!" అన్నాడు రంగారెడ్డి మెచ్చుకోలుగా.

మర్నాడు సాయంత్రం మేము ఆఫీస్ నుంచి వచ్చేసరికి కాలనీ మధ్యలోని కూరగాయల బళ్ళుచుట్టూ ఆడాళ్ళందరూ మూగికనిపించారు. పెద్దెత్తున వాదోపవాదాలు జరుగుతున్నట్లు తెలీడంతో మేమూసరాసరి వాళ్ళదగ్గరకు చేరుకున్నాము.

"మార్కెట్లో టమాటో కిలో పదిరూపాయలుంటే నువ్వు పదిహేను రూపాయల కమ్ముతున్నావా? కిలోకి ఓ రూపాయి ఎక్కువ వేసుకునేవాడివి ఇంతలోనే ఏం రోగం వచ్చింది? ఒక కిలో మీద ఐదు రూపాయలు లాభం వేసుకుంటావా?" పార్వతమ్మగారు గట్టిగా అరుస్తోంది.

"ఇప్పుడూ నాకు మిగిలేది కిలోకి ఓ రూపాయికంటే ఎక్కువ ఉండదమ్మా–" దీనంగా చెప్తున్నాడతను.

వెంటనే శాయీరామ్ కల్పించుకున్నాడు.

"హరికథలు చెప్పకోయ్! కిలోకి ఐదు రూపాయలు ఎక్కువ వేసుకుని ఒక్క రూపాయి అంటావేం–"

"ఆ ఐదురూపాయలూ నాదికాదు సార్! పోలీసులకు మామూలివ్వాలి! కొత్త పోలీస్‌స్టేషన్ పెట్టారు కదా ఈ ఏరియాలో" రంగారెడ్డి ఆశ్చర్యపోయాడు.

"పోలీసులకు మామూళ్ళు ఇవ్వాలా మీరు?"

"అవున్సార్! అందులో కొత్తేముంది? పోలీస్‌స్టేషన్ చుట్టుపక్కల అమ్మకాలు జరిపే వారందరూ లెక్కప్రకారం మామూళ్ళు ఇవ్వాల్సిందే–"

"మీరు ఇవ్వకపోతే ఏమవుతుంది?"

"ఒకటనేమిటి సార్! వాళ్ళు మా బండిని లాక్కోవచ్చు. వేరేకేస్‌లో మమ్మల్ని ఇరికించి నానా ఇబ్బందీ కలిగించవచ్చు– తూకం రాళ్ళు మోసమని లాకప్‌లో పడేయవచ్చు–"

అందరం మొఖాలు చూచుకున్నాం! పోలీస్ స్టేషన్ కాలనీ పక్కన ఏర్పాటుచేయడం వల్ల అన్నీ లాభాలే ఉంటాయనుకున్నాము. కానీ ఇప్పుడు పరోక్షంగా మా పోలీస్‌స్టేషన్‌కి మేమే మామూళ్ళు ఇచ్చుకోవాల్సి వస్తోంది– కూరగాయలకు ధర ఎక్కువ చెల్లించడం ద్వారా!

అయితే ఈ విషయంలో మేము చేయగలిగిందేమీ లేకపోవడం వల్ల మౌనం వహించాము.

మరోవారంరోజుల్లో మా కాలనీ చుట్టుపక్కలున్న అన్ని షాపుల్లోనూ, ధరలు కొంచెం కొంచెంగా పెరిగిపోయాయ్. రోడ్డు మీదున 'టీ' హోటల్‌వాడు హఠాత్తుగా నీళ్ళ 'టీ' ఇవ్వటం ప్రారంభించాడు.

"ఏం జేయాల్సర్– దినము 'ఫుకట్' చాయ్ పోలీస్‌స్టేషన్‌కి ఇయ్యాలి! లేకుంటే ఆళ్ళతో కిరికిరి–" అన్నాడతను శాయిరామ్‌తో.

మరో వారం గడిచేసరికి హఠాత్తుగా మా కాలనీ పక్కనే ఓ చిన్న గుడుంబా దుకాణం వెలిసింది. వెంటనే అందరం కలిసి దుకాణం వాడి దగ్గరకెళ్ళాం.

"ఈ దుకాణం ఈడెందుకు పెట్టినావ్?" అడిగాడు యాదగిరి.

"నువ్వెవరు అడగడానికి?" ఎదురు తిరిగాడు వాడు.

"కాలనీ వాడిని! కాలనీ పక్కన గుడుంబ దుకాణం ఉండకూడదు! సాంయత్రానికల్లా తీసేయ్? లేకుంటే పోలీస్ కంప్లెయింట్ ఇస్తాం!" బెదిరించాడు గోపాల్రావ్.

వాడు ఘోల్లున నవ్వాడు.

"నీ యవ్వ! గింతేనా! ఇంకేం లొల్లి పెడతారోనని పరేషానయినా! ఇన్‌స్పెక్టర్‌సాబే పర్మిషనిచ్చిండు నాకు!"

అందరం మొఖాలు చూచుకున్నాం మళ్ళీ.

"పదండి– పోలీస్‌స్టేషన్‌కెళ్ళి ఇన్‌స్పెక్టర్‌నే అడుగుదాం!" అన్నాడు శాయిరామ్.

అందరం పోలీస్‌స్టేషన్ కెళ్ళాం.

"గుడ్ మాణింగ్ సర్" అన్నాడు రంగారెడ్డి.

ఇన్‌స్పెక్టర్ కంగారూ అనే జంతువుని చూసినట్లు చూశాడు మమ్మల్ని.

"ఎవరు మీరు?" అడిగాడు కర్కశంగా.

అందరం షాక్ తిన్నాం! మా అందరినీ భుజం తట్టి షేక్‌హాండిచ్చి ప్రేమగా మాట్లాడిన మనిషేనా ఇతను అన్న అనుమానం కలిగింది.

"మేమే సార్!" ఈ కాలనీ కమిటీ మెంబర్స్–"

"ఏం గావాల?"

"కాలనీ పక్కనే గుడంబ దుకాణం తెరచారండీ– ఎవరో–"

"అయితే నన్నేం జేయమంటావ్? చల్– బయటకు నడవం(డి"

"అదిగాద్సార్!"

"ఒక్కసారి చెప్తే సమజ్ కాదా మీకు? బయటకు నడవం(డి–" గట్టిగా అరిచాడు.

"దిసీజ్ టూమచ్–" అన్నాడు గోపా(లావ్. "ఇదంతా మా ప(త్రికలోరాస్తాను రేపే!"

"ఫార్టీ(త్రీ–" పిలిచాడు ఇన్‌స్పెక్టర్.

"యస్సార్–" ఓ కానిస్టేబుల్ పరుగుతో వచ్చాడు.

"ఇస్ కో అందర్‌కర్‌దో" అన్నాడు గోపా(లావ్‌ని చూపిస్తూ.

మరుక్షణంలో ఆ కానిస్టేబుల్ గోపా(లావ్‌ని లాక్కెళ్ళి లాకప్‌లో పడేశాడు.

"దీసీజ్ టూ మచ్! గుడుంబా దుకాణం పెట్టడానికి మీరెందుకు పర్మిషనిచ్చారని అడిగినందుకు మా (పెసిడెంట్‌ని లాకప్‌లో వేస్తారా? మేము సహించం!" అంటూ అరిచాం అందరం.

"మీరందరూ కూడా బయటికి పోతారా– లోపల వేయాల్నా?" మావంక చూసి మళ్ళీ అడిగాడు.

అందరం బయటికొచ్చి నిలబడ్డాము.

"ఇప్పుడేమిటి చేయడం!" అడిగాడు రంగారెడ్డి.

"నేను టి.వి. (డ్రామావేసిన ఆర్టిస్ట్‌నని చెప్తే వదిలేస్తారేమో–" అన్నాడు జనార్ధన్ తల హెయిర్‌స్టైయిల్ సరిజేసుకుంటూ.

"పిచ్చి మాటలు మాట్లాడకు– ఆ విషయం చెపితే నిన్నుకూడా లాకప్‌లో పడేస్తాడు–" అన్నాడు శాయిరామ్.

మరో అరగంట తర్వాత గోపా(లావ్ బయటకొచ్చాడు.

"ఏం జరిగింది– ఎలా వదిలేశాడు?" అడిగాం అందరం అతని చూట్టూ మూగి.

"ఇంకెప్పుడూ పోలీస్‌స్టేషన్ మీద దాడిచేయమని రాసిమ్మన్నాడు. రాసిచ్చాను."

"అదేమిటి? మనం దాడి ఎప్పుడు చేశాం–"

"నేనూ అదే అడిగానుగానీ వినిపించుకోలేదు అలా రాసివ్వకపోతే నాపేరు రౌడీషీట్‌లో కెక్కిస్తానన్నాడు."

మేము మాట్లాడుతుండగానే ఇన్‌స్పెక్టర్ బయటికొచ్చాడు.

"ఏయ్– ఎవ్వరు మీరు? ఎందుకిక్కడ నుంచున్నారు?"

"వెళ్ళిపోతున్నాం సార్–" అన్నాడు గోపాల్రావ్ భయంగా.

"ఇగో– ఇది లాస్ట్ వార్నింగ్! ఇక్కడ సెక్షన్ 144 అమల్లో ఉన్నది. మీ అందరినీ లోపట జేసేస్తా! మంచిగా ఇళ్ళకు పోండ్రి"

అందరం పరుగుతో ఇళ్ళకు చేరుకున్నాం!

మరో వారం రోజులు ప్రశాంతంగా గడిచిపోయినయ్. ఆ తరువాత మొదలయింది కథ. జనార్ధన్ మోటర్‌సైకిల్‌మీద ఆఫీసు నుంచి వస్తూంటే మా కాలనీ దగ్గర ఓ సైకిల్ వచ్చి వెనుకనుంచి డాష్ ఇచ్చింది. ఆ కన్‌ఫ్యూజన్‌లో సైకిల్‌వాడితోపాటు జనార్ధన్ కూడా కిందపడకతప్పలేదు. పడేప్పుడు బలమంతా చేతి వేలుమీద పడడంతో వేలు ఫ్రాక్చర్ అయింది. అందరం అప్పటికప్పుడే జనార్ధన్‌ని ఆటోలో వేసుకుని ఉస్మానియా హాస్పిటల్ చేరుకున్నాము. మామూలుగానే మమ్మల్నందరినీ నానాహింసలూ పెట్టాక జనార్ధన్ చేతిని ఎక్స్‌రేతీసి కట్టుకట్టిపంపించివేశారు. ఈలోగా శాయిరామ్, గోపాల్రావ్ కలిసి రోడ్డు మీదపడిన జనార్ధన్ మోటార్ సైకిల్‌ని తీసుకెళ్ళి వాళ్ళింటి దగ్గరకు చేర్చారు.

మర్నాడు పొద్దున్నే మేమంతా ఆఫీస్‌కెళ్ళబోతూ ఉండగా పోలీస్ కానిస్టేబుల్ వచ్చాడు మా ఇంటికి.

"నిన్న సాయంత్రం యాక్సిడెంట్ అయిందటగా సార్!" అడిగాడతను.

యాక్సిడెంట్ అయిన మర్నాడే అతనలా పరామర్శించడానికి రావడం మాకెంతో ఆనందం కలిగించింది.

"ఆ! పెద్ద యాక్సిడెంట్ కాదులే! చిన్నది– ఏం ఫర్వాలేదు! ఈ వేలు ఫ్రాక్చరయింది అంతే! నువ్వేం వర్రీ అవకు–" అన్నాడు జనార్ధన్ ఆప్యాయంగా.

"నేను కాద్సార్– మా ఇన్‌స్పెక్టర్ గారు...."

"ఆయనను కూడా బాధపడవద్దని చెప్పండి! చాలా చిన్నదెబ్బే తగిలింది–" అన్నాడు రంగారెడ్డి.

"ఈ ఇన్‌స్పెక్టర్ పైకలా ఉన్నా లోపల చాలా మంచిమనిషిలాగున్నాడు! పాపం ఎంత అదుర్దాతో కబురుచేశారోచూడు" అన్నాడు గోపాల్రావ్.

"అవును! పోలీస్ డిపార్ట్‌మెంట్ దృక్పథంలోనే చాలా మార్పు వచ్చింది" అన్నాడు శాయిరామ్.

"ఇదంతా ఎన్టీఆర్ ప్రభుత్వం వల్లే సాధ్యమయిందని నేను నిన్నే మా పేపర్లో రాశాను–" అన్నాడు గోపాల్రావ్ గర్వంగా.

హఠాత్తుగా కానిస్టేబుల్ మొఖంలో ఎక్స్‌ప్రెషన్ మారిపోయింది.

"నిన్ను వెంటనే స్టేషన్‌కి తీసుకురమ్మనాడు మా ఇన్‌స్పెక్టర్ సాబ్!" అన్నాడు సీరియస్‌గా జనార్ధన్ వేపు చూస్తూ.

"నన్నా?"

"అవును"

"ఎందుకు?"

"కేసు రాయడానికి!"

ఈసారి అందరం ఉలిక్కిపడ్డాం

"కేసేమిటి?"

"గదే– మీ మోటార్ సైకిల్– సైకిల్ టక్కర్ అయినయ్ గదా? దాన్ని గురించి"

"దానిక్కేసెందుకు? మేమేమీ కంప్లెయింట్ ఇవ్వలేదుగదా దాన్ని గురించి–"

"అది ఇంకొకగల్తీ– యాక్సిడెంట్ కేస్‌ని పోలీస్‌కి చెప్పకుండా చుపాయించిన్రు! రెండు కేసులు!"

"దిసీజ్ టూమచ్" అన్నాడు శాయీరామ్.

"బేకార్ ఇంగ్లీషు మాట్లాడకంద్రి! జల్దివస్తరా? రారా?" కోపంగా అడిగాడు కానిస్టేబుల్.

"పదండి! ఇన్‌స్పెక్టర్‌తోనే మాట్లాడదాం!" అన్నాడు రంగారెడ్డి. అందరం పోలీస్‌స్టేషన్ కెళ్ళాం.

"గుడ్‌మాణింగ్ సార్!" అన్నాడు శాయీరామ్ ఇన్‌స్పెక్టర్‌తో.

"ఎవర్నువ్వు?"

"నేను శాయీరామ్‌నండి! కాలనీ ఆర్గనైజింగ్ శెక్రెట్రీని"

"నువ్వెందుకొచ్చినావీడకు?"

"అదే! మా వాడిని పిలిపించారంటేనూ..."

"ఇదిగో– మీకు లాస్ట్ వార్నింగ్! నేనెవళ్ళనుపిలుస్తే ఆళ్ళేరావాల! ఇదేం పెండ్లిల్లుగాడు. బంధుమిత్రలతోని రానికి! నడవండి బయటకు"

శాయీరామ్ రెండడుగులు వెనక్కువేసి రంగారెడ్డి వేపు చూశాడు. రంగారెడ్డి యాదగిరివేపు చూశాడు.

అందరం బయటకొచ్చి నిలబడ్డాం. లోపల్నుంచీ జనార్ధన్, ఇన్‌స్పెక్టర్‌ల సంభాషణ వినబడుతూనే ఉంది.

"యాక్సిడెంట్ అయినాక నీ మోటర్‌సైకిల్ ఆ జాగాకెళ్ళి ఎందుకు తీసినావయ్యా?"

"రోడ్ ట్రాఫిక్‌కి అడ్డం అని తీసేసానండీ...."

"పోలీసులొచ్చేవరకూ తియ్యగూడదు గదా!"

"కానీ అది చిన్న యాక్సిడెంటేగదండీ– సైకిల్‌వాడు నెమ్మదిగానే డాష్ ఇచ్చాడు–"

"ఇదిగో! ఎక్కువతక్కువ మాట్లాడకు! యాక్సిడెంట్ గురించి పోలీస్‌కి చెప్పకుండా చూపాయించినందుకు నీమీద కేసుపెడుతున్నా."

"ఇందులో దాయాలని దాచిందేమీలేదండీ–చిన్నదానికి పోలీస్ వరకూ ఎందుకని..."

"ఇగో ఫాల్తూ మాటలు మాట్లాడకు!" గట్టిగా అరచాడు ఇన్‌స్పెక్టర్. మేమంతా ఉలిక్కిపడ్డాం. పోలీస్ అంటే మాక్కొంత అవగాహన ఉందిగానీ మరీ ఇంత అవగాహన కాలేదెప్పుడూ. సరిగ్గా అప్పుడే ఓ కానిస్టేబుల్ మా దగ్గరకొచ్చాడు చిరునవ్వుతో.

"ఏమిసార్ ఈ కిరికిరి! మనమంతా ఒక్క జాగాలో ఉండేటోళ్ళం" అన్నాడు ఆప్యాయంగా. వెంటనే "హెల్‌రైడర్స్" ఇంగ్లీషు పిక్చర్లో అయిదు నిముషాల పాటు మామూలు మనిషిలా మాట్లాడిన పోలీస్ పాత్ర గుర్తు కొచ్చింది మా అందరికీ.

"మాదేముందీ– మీ ఇనిస్పెక్టర్‌గారే కదా పిలిపించి గొడవచేస్తోందీ?" కోపంగా అన్నాడు రంగారెడ్డి.

"ఇనిస్పెక్టర్ సాబ్ చాలా మంచిమనిషి సార్! పై ఆఫీసర్ల దిక్కుకెళ్ళి పరేషాన్ అయికేసులు బుక్‌చేస్తున్డు! గంతనే! మీరు మన కాలనీ వోళ్ళే కాబట్టి వెయ్యిరూపాయలిచ్చేయండ్రి! కేస్ మాఫ్ జేస్తడు!"

మాకు మతి పోయినట్లయింది.

"ఏమది? వెయ్యి రూపాయలు మేమివ్వాల్నా" ఆశ్చర్యంగా అడిగాడు యాదగిరి.

"మన కాలనీ వాండ్లు కాబట్టి– వెయ్యి రూపాయల్సార్! లేకుంటే రెండు వేలకు ఒక్కపైస తగ్గెడిది కాదు" జాలిగా అన్నాడతను.

"అంటే మేము లంచం ఇవ్వాలా?" కోపంగా అడిగాడు రంగారెడ్డి.

"ఏం 'లంచం' అని గట్టిగా చిల్లాయిస్తున్నావ్! అట్లరుస్తే భయమనుకుంటున్నావా?" తనూ కోపంగా అడిగాడు కానిస్టేబుల్.

శాయిరామ్ ఇద్దరికీ సర్దిచెప్పాడు. "మా గురించి నీకు తెలియదేమో! మేము లంచాలు ఇవ్వము– తీసుకోము" అన్నాడు పౌరుషంగా.

"ఇయ్యకుంటే కోర్టుచుట్టూ తిరగండి! ఎవళ్ళకు నష్టం" అనేసి వెళ్ళిపోబోయాడతను.

"అసలీ యాక్సిడెంట్ అయినట్లు మీకెవరు చెప్పారు?" అనుమానంగా అడిగాడు గోపాల్రావ్.

"ఆమాత్రం తెలివి లేదువయ్యా? హాస్పిటల్ డాక్టర్లు బరాబర్ చెప్తరు మాకు" ఈలోగా జనార్ధన్ బయటి కొచ్చాడు. అందరం వాడి చుట్టూ మూగాం.

"ఏమన్నాడు?"

"జరిగిందంతా రాసిమ్మన్నాడు! ఇప్పుడు నా మీద కేస్ పెడతాడంట."

"వెయ్యి రూపాయలు ఇస్తే వదిలేస్తారని కానిస్టేబుల్ చెప్తున్నాడు మరి..." అందరం మా ఇంటికి చేరుకుని ఉన్నతస్థాయి చర్చలు ప్రారంభించాం.

"ఇదంతా మా పేపర్లో రాసేస్తా- తిక్క వదిలిపోతుంది" అన్నాడు గోపాల్రావ్.

"ఏ పేపర్ చూచినా అన్నీ ఇలాంటి వార్తలే రోజూనూ! వీటినెవరు పట్టించుకుంటారు?" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి.

కాసేపటి తర్వాత అందరం ఓ నిర్ణయాన్నికొచ్చాం. అదేమిటంటే- ఎంతో కొంత లంచంకట్టి కోర్టుకెళ్ళే బాధ తప్పించుకోవటం- వెంటనే కానిస్టేబుల్ని బయటకు పిలిచి బేరాలు ప్రారంభించాం.

"మరీ వెయ్యి రూపాయలు చెప్తే ఎలా? ధర చాలా ఎక్కువ? కొంచెం తగ్గించుకోమని చెప్పు మీ ఇన్‌స్పెక్టర్‌గారితో" అన్నాడు శాయీరామ్.

"ఇదే కన్సెషన్ రేట్ సార్! మొన్న ఆ పాన్‌డబ్బా రాములు యాక్సిడెంట్‌లో ఎంత చార్జీచేసిండో ఎరుకనా? మూడువేలు!"

అందరం ఆశ్చర్యపోయాము "మూడు వేలా?"

"అవ్! కావాల్నంటే రాముల్నే అడిగి రాండ్రి! నేనీడనే నిలబడతా-"

"అబ్బే ఎందుకులెండి మీ మాటమీద మాకు గురి ఉంది. కానీ ఈ ఒక్కసారికీ అయిదు వొందలు చేసుకోండి! ఈసారి యాక్సిడెంట్ అయినప్పుడు తప్పకరేటు పెంచుతాం" అన్నాడు రంగారెడ్డి.

"మంచిగున్నార్సార్ మీరు! ఈ పైసలు మేముతిననికా? మాపై ఆఫీసర్లకియ్యాల! ఎరుకనా?"

ఇక లాభం లేదని జనార్ధన్ చప్పున కానిస్టేబుల్ చేతులు పట్టుకున్నాడు.

"బాబ్బాబు ! కాదనకు! ఓ పక్క వేలు ఫ్రాక్చర్ అయి నానా చావూ ఛస్తోన్నాను. మరోపక్క బండికిరి పేరు. నేను చేసే ఉద్యోగమా- ఎందుకు పనికిరాని డిపార్ట్‌మెంట్! ఒక్క రూపాయ కూడా పై డబ్బు రాదు."

"ఏ డిపార్ట్‌మెంట్ మీది?" అనుమానంగా అడిగాడు కనిస్టేబుల్.

"పోస్టల్ డిపార్ట్‌మెంట్-"

కానిస్టేబుల్ మొఖమంతా జాలితో నిండిపోయింది.

"థూ థూ థూ! ఫాల్తూ నౌకరీ భాయ్! మీకు ప్రమోషన్‌రాదు, జీతం పెరగదు పైస ఆమ్దానీలేదు- నిజం చెప్తున్న ! నాకు వెయ్యిన్నరజీతిమిచ్చినగానీ ఆ డిపార్ట్‌మెంట్‌లో జేరను."

అదేమంచి అవకాశమని జనార్ధన్ వెంటనే తనజేబులోనుంచి అయిదువందలు తీసి అతనిచేతిలో పెట్టేశాడు.

"సరే! మా ఇనిస్పెక్టర్‌సాబ్‌కి నేను సమ్‌జాయిస్తగానీ మళ్ళీ యాక్సిడెంట్ అయినప్పుడు మాత్రం బరాబర్ వెయ్యిరూపాయలియ్యాల! ఏమంటున్నా?"

"ఓ తప్పక ఇస్తాను!"

కానిస్టేబుల్ వెళ్ళిపోయాడు.

మర్నాడు పొద్దున్నే యాదగిరి హడావుడిగావచ్చాడు మా యింటికి.

"గురూ! రాత్రి ఏం జరిగిందో చూశావా! ఆమెయిన్ రోడ్డు మీదున్న వీడియోపార్లర్‌లో బ్లూ ఫిలిమ్ వేశారుట!"

నేను ఆశ్చర్యపోయాను. ఈ వీడియోపార్లర్ మరెవరిదో కాదు. మా కాలనీ తాలూకు ఓ నిరుద్యోగిది.

వీడియోపార్లర్ పెడితే లాభసాటిగా ఉంటుందని మేమే సలహా ఇచ్చాము అతనికి.

అప్పుడే శాయీరామ్, రంగారెడ్డి కూడా వచ్చేశారు– ఆ వార్త మరొకరి ద్వారా తెలిసి.

"ఆ కుర్రాడికేం పోయేకాలం వచ్చింది? బాగా చదువకున్నవాడు, మంచివాడూ అనిమనం వీడియోపార్లర్ పెట్టిస్తే ఇప్పుడువాడు మొత్తం మన కాలనీ కుర్రాళ్ళందరినీ చెడగొట్టేస్తున్నాడు కదా–" అన్నాడు శాయీరామ్.

"పదండి వాడినే అడుగుదాం!" అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ.

అందరం కలిసి వీడియో పార్లర్‌కి చేరుకున్నాం మమ్మల్నందర్నీ చూసి కొంచెం ఖంగారు పడ్డాడతను.

"బ్లూఫిలిమ్ వేశావుట కదా రాత్రి! మన కాలనీ కుర్రాళ్ళకు చాలామందికి టిక్కెట్లు అమ్మావుట–" అడిగాడు శాయీరామ్.

అతని మొఖం పాలిపోయింది. తలవంచేసుకున్నాడు. ఏడుపొక్కటే తరువాయ్!

"ఏం చేయ్యమంటారు సార్! పోలీస్‌స్టేషన్కి నెలకి వెయ్యిరూపాయలు ఇవ్వాలని కబురు చేశారు. నెలకు దానిమీద రాబడి అంతా కలిపితే ఎనిమిదొందలేసార్ అని ఎంత చెప్పినా వినిపించుకోలేదు. కావాలంటే బ్లూఫిలిమ్స్ వేసుకుని రాబడి పెంచుకో. మేమునిన్నేమీచేయం! కానీ వెయ్యి రూపాయలు చచ్చినట్లు కట్టాల్సిందే– లేకపోతే రేపే మూసేస్తాం–" అన్నారు. అందుకని రాత్రిషో వేసి ఆ కలెక్షన్ ఆరొందలూ తీసుకెళ్ళి ఇచ్చివస్తున్నాను. ఇకనుంచీ నెలకు రెండువేలివ్వాలని కావాలంటే రోజూ ఆ ఫిలిమ్స్ వేసుకోమని అంటున్నారిప్పుడు."

అందరం మొఖాలు చూచుకున్నాం!

"పదండి! ఈ పోలీసు వ్యవహారమేమిటో తేల్చుకుందాం దగ్గరుండి. గుడంబా దుకాణం,

బ్లూఫిలిమ్స్‌- క్లబ్‌లు ఇవ్వన్నీ ప్రోత్సహించటానికా పోలీస్‌స్టేషన్‌ పెట్టింది?" అరచాడు మా కాలనీ కవి విప్లవజ్యోతి.

అందరం తిన్నగా పోలీస్‌స్టేషన్‌ చేరుకున్నాం.

ఇనిస్పెక్టర్‌ అప్పుడే మోటార్‌సైకిల్‌ మీదెక్కడికో బయల్దేరబోతున్నవాడల్లా మమ్మల్ని చూసి ఆగాడు.

"మళ్ళీ ఎందుకొచ్చిన్రు ఇక్కడికి? కోపంగా అడిగాడు "ఈ పోలీస్‌స్టేషన్‌ చుట్టపక్కల కనిపించొద్దని చెప్పలే నేను?"

"మీతో మాట్లాడాలని వచ్చాము-"

"ఏ విషయం?"

"కాలనీ దగ్గర ఆ గుడంబా దుకాణం తెరవటం గురించీ, మట్కా పెద్ద ఎత్తున ఓపెన్‌గా జరగటం గురించీ, ఎప్పుడూ మంచి సినిమాలు వేసే ఆ వీడియోపార్లర్‌ వాడు బ్లూఫిలిమ్స్‌ వేయటం గురించీ మాట్లాడాలి-" అన్నాడు శాయిరామ్‌ ధైర్యం తెచ్చుకుని.

ఇనిస్పెక్టర్‌ మోటార్‌ సైకిల్‌ దిగి మీదమీదకు వచ్చి నిలబడ్డాడు భయంకరంగా.

"ఏయ్‌ ఏమ్‌ సంగతి? జులుమ్చేయని కొచ్చిన్రా! లేక పెద్ద మొనగాల్లమనుకుంటున్రా! ఎక్కడో, ఎవరో, ఏమోజేస్తే- పాగల్‌ గాండ్లలాగా పోలీస్‌స్టేషన్‌ కొస్తారు? నడవండ్రి ఈడకెళ్ళి-"

"మేము వెళ్ళం! ముందు ఆ గుడంబా దుకాణం, వీడియో పార్లర్‌ మూయించాలి." హఠాత్తుగా ఇన్‌స్పెక్టర్‌ శాయిరామ్‌ మెడమీద చేయివేసి దూరంగా తోశాడు.

అదిచూసి అందరూ రెండడుగులు వెనక్కివేశాము.

"పోతారా? లాఠీచార్జీ చేయమన్నారా?" అరచాడతను.

కాలనీకవి విప్లవజ్యోతి 'లాఠీమాట' వింటూనే బులెట్‌లా వాళ్ళింటివైపు దూసుకుపోయాడు. మేమెంత పిలుస్తున్నా వినిపించుకోలేదు.

"సరే- మేమంతా కలసి మీమీద పోలీస్‌ కమీషనర్‌గారికి అర్జీ పెడతాం!" అన్నాడు గోపాల్రావ్‌ కసిగా.

"ఏయ్‌ టు సిక్టిఫోర్‌! ఈళ్ళందర్ని లోపలేసేయ్‌-" గట్టిగా అరచాడు ఇన్‌స్పెక్టర్‌.

మరుక్షణంలో ఇద్దరు కానిస్టేబుల్స్‌ పరుగుతోవచ్చి మా ముందు నిలబడ్డారు.

"మనం చేసేపనేదో సైలెంట్‌గా చేద్దాం పదండి!" అన్నాడు రంగారెడ్డి మావేపు తిరిగి. అందరం వెనక్కు తిరిగి నడిచాము నిశ్శబ్దంగా.

అప్పటికప్పుడే రంగారెడ్డి అర్జీ తయారు చేస్తానన్నాడుగానీ- ఆఫీస్‌లకు టైమయిపోవటం వల్ల సాయంత్రం వరకూ ఆ కార్యక్రమాన్ని వాయిదావేశాం!

అందరికీ ఆ ఇనిస్పెక్టర్ ప్రవర్తన అవమానకరంగా అనిపించటం చేత ఆ రాత్రి తిరిగి కాలనీ వేదిక దగ్గర సమావేశమయ్యాము.

రంగారెడ్డి అర్జీరాయటం మొదలుపెట్టాడు. రాత్రి పదయిపోయినా ఇంకా అర్జీపూర్తి కాలేదు. ఇంగ్లీషు గ్రామరు పుస్తకరం ఉండుండి రిఫర్ చేయాల్సివస్తోంది.

మేమందరం ఈ హడావిడిలో ఉండగా ఓ పోలీస్ జీప్ శరవేగంతో వచ్చి మాకు కొన్ని అంగుళాల దూరంలో సడెన్‌గా ఆగింది. అందులోనుంచి ఓటార్చిలైట్ ఫోకస్ పడింది మామీద.

"ఏయ్! ఎవర్రా మీరు!" అంటూ ఓ గొంతుగట్టిగా అరిచింది జీప్‌లోనుంచి.

అనుకోని సంఘటనకు మేమంతా నిశ్చేష్టులమయినా మమ్మల్నలా అంత అవమానకరంగా సంభోధిస్తున్నవాడెవడా అని జీప్ దగ్గరకు నడిచాము కోపంగా.

"ఏం మాట్లాడరేరా? ఎవరు మీరు? ఏంజేస్తున్నారిక్కడ!" మళ్ళీ సైరన్‌లా మోగింది గొంతు. మరుక్షణంలో నలుగురు కానిస్టేబుల్స్ జీప్ వెనుకనుంచి దిగి నిలబడ్డారు. ముందు కూర్చుని బ్రాందీ పవర్‌లో అరుస్తోంది సర్కిల్ ఇనిస్పెక్టర్ అని తెలిసింది మాకు అతనికున్న బాడ్జీవల్ల.

"మేము కాలనీ వాళ్ళం!" అన్నాడు శాయీరామ్ టార్చిలైట్ వెలుతురికి కళ్ళు మూసుకుని.

"ఇంత రాత్రివేళ ఇక్కడేం జేస్తున్నారు?"

"అర్జీరాస్తున్నాం" అన్నాడు రంగారెడ్డి కల్పించుకుంటూ.

"హూ ఆర్ యూ?" టార్చిలైట్ రంగారెడ్డి మొఖం మీదవేశాడతను.

"నాపేరు రంగారెడ్డి"

"డోంటాక్- ఆ సిగరెట్ అవతల పారేసి మాట్లాడు! ఇడియట్! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?"

"ఎవరయినాగానీ అలా ఇడియట్ గిడియట్ అన్నావంటే బాగుండదు" కోపంగా అన్నాడు రంగారెడ్డి.

"షటప్" మరిం భీకరంగా అరచాడతను.

రంగారెడ్డి సైలంటయిపోయాడు.

"ఆ సిగరెట్ పారెయ్ ముందు-"

రంగారెడ్డి సిగరెట్ పారేసేడు.

"ఏయ్- నువ్వెవరు నిన్నే- ఏయ్- రెడ్ మఫ్లర్!"

గోపాల్రావ్ ఖంగారుగా మఫ్లర్ తలమీద నుంచి తీసి చుట్టేసి చేత్తోపట్టుకున్నాడు. టార్చిలైట్ అతని ముఖం మీద పడిందిప్పుడు.

"నా పేరు గోపాల్రావండి! జర్నలిస్ట్ని!"

"షటప్! నువ్వెవడివో చెప్పు! అంతే! జర్నలిస్టు, గాడిదగుడ్డు అని చెప్పనక్కరలేదు."

"సారీ! ఉద్యోగం అడిగారనుకుని."

"నీలాంటి బోడి జర్నలిస్టులను పాతికమందిని బొమికలిరగ్గొట్టాను! వాళ్ళ కెమేరాలు, బ్రీఫ్ కేసులూ విరిచి అవతల పారేశాను– జర్నలిస్ట్ అంటే గొప్పనుకుంటున్నావా? తొక్క రేగ్గొడతాను జాగ్రత్త!"

గోపాల్రావ్కి పౌరుషం పొడుచుకొచ్చింది.

"అలా ఇష్టమొచ్చినట్లు మాట్లాడావంటే మర్యాదగా ఉండదు" గట్టిగా అన్నాడు.

"షటప్! ఏంట్రా నీకు మర్యాదిచ్చేది? అయినా తలకు మఫ్లర్ కట్టుకుని నిలబడతావురా? నేనిక్కడ మాట్లాడుతూంటే– లాకప్లోతోస్తా నకరాలు చేశావంటే."

గోపాల్రావ్ సైలంటయిపోయాడు.

"మీరంతా ఇక్కడ మీటింగ్ పెట్టటానికి పోలీస్ పర్మిషన్ తీసుకున్నారా?"

అందరం మొఖాలు చూచుకున్నాం.

"మాట్లాడరేం? అడిగేది మిమ్మల్ని కాదూ?"

"మా కాలనీ మధ్యలో కలుసుకుని మాట్లాడుకోవడానికి పర్మిషనెందుకండి?" అడిగాడు జనార్ధన్ ఓ మూలనుంచీ.

"ఎవడాడు మాట్లాడింది?"

"నేనే! ఆడుగీడు అన్నారంటే బాగుండదు. నేను టి.వి. ఆర్టిస్తుని!"

"డోంటాక్! టి.వి. ఆర్టిస్ట్ అన్నావంటే నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద తోసేస్తా! ఇడియట్! నేనెవర్ని అడుగుతే ఆడే మాట్లాడాలి! ఇంకోళ్ళునోరెత్తొద్దు. సమజయిందా?"

"మేమెప్పుడూ ఇక్కడే కలుసుకుని మాట్లాడుకుంటామండీ! మా కాలనీయేగా ఇది!" అన్నాడు రంగారెడ్డి గొంతు పెగుల్చుకుని.

"కాలనీ అంటే నీ గ్రాండ్ఫాదర్ ప్రాపర్టీకాదు. కాలనీలో ఇల్లేనీది. ఇంట్లో నుంచి బయటికొచ్చి ఏంచేసినాగానీ పోలీస్ పర్మిషన్ కావాలి!"

ఎవ్వరూ మాట్లడలేదు.

"మీ అందరూ డెకాయిట్స్ కాదని నాకేమిటి నమ్మకం! నగరమంతా రోజూ దొంగతనాలు, దోపిడీలు జరుగుతున్న సంగతి తెలుసుకదా! మీరే దొంగతనం చేసేగాంగ్ అనినేనంటాను!"

"అనకేంజేస్తారు? అసలు దొంగల నెలాగూ పట్టలేరుకదా! ఇలా మాలాంటి వాళ్ళనే పట్టండి!" వెనుకనుంచి గొంతుమార్చి అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్. కోపంతో జీపులో నుంచి తూలుతూ మా గుంపు వెనకకు నడిచాడు సర్కిల్.

"ఎవఁడ్రా ఆ మాట అంది? రాస్కెల్ ఎవఁడ్రా ఆడు? చెప్పకపోతే అందరినీ తోలువలి చేస్తాను–"

ఈ హడావుడంతా చూసి మా కాలనీ డిటెక్టివ్ రచయిత్రి పరుగుతో వచ్చింది మా దగ్గరకు. టార్చిలైట్ ఆమెమొఖం మీద వేశాడు సర్కిల్.

"ఎవర్నువ్వు?"

"ముందాలైటార్పండి!" అంది రాజేశ్వరి కోపంగా.

"మొన్న లైసెన్స్ లేకుండా స్కూటర్ నడిపింది నువ్వేకదూ?" కోపంగా అడిగాడతను.

మేమంతా తెల్లబోయాం. మా కాలనీలో ఆడాళ్ళెవరికీ వెహికల్స్‌లేవు.

"నేనెప్పుడు నడిపాను?" ఆశ్చర్యంగా అందామె.

"ఏయ్ రహమాన్! ఈ పోరేకదూ లైసెన్స్ లేకుండా స్కూటర్ నడిపింది?"

"కాద్సార్! ఇది ఇంకొక లేడీ ఉన్నయ్. కాలనీ కూడా ఇదికాదు, బ్యాంక్‌కాలనీ–"

"పోనువ్ ఈడకెళ్ళి!" రాజేశ్వరితో అన్నాడు సర్కిల్.

"నేనెందుకు పోవాలి? నేనిక్కడే ఉంటాను–" మొండిగా అందామె.

"ఏయ్ పోరి ఎక్కువ తక్కువ మాట్లాడినావంటే లాకప్‌లోవేస్తా తెల్సిందా?"

"వెయ్ చూద్దాం! లేడీ పోలీస్ లేందే నన్నెట్లా అరెస్ట్ చేస్తావో నేనూ చూస్తా–" రూల్స్ తెలీకుండానే అందరం తప్పట్లుకొట్టాం! అదే అదనని సర్కిల్ మా మధ్యకొచ్చాడు మళ్ళీ! "రాస్కెల్స్ ఒక్క నిమిషం టైమిస్తున్నా మీకు! ఎవడింట్లోకి ఆడు వెళ్ళకపోయాడంటే. జీప్‌లో వేసుకెళ్తా స్టేషన్‌కి–" అన్నాడు తూలిపడబోయి మళ్ళీ నిలదొక్కుకుని.

"పదండి! కిరికిరి ఎందుకు? ఇదంతా నేను రూపే మా పేపర్లో రాస్తానుగా" అన్నాడు గోపాల్రావ్.

"ఒరే జర్నలిస్ట్ నీపేపర్నీ నిన్నూ తుక్కురేగ్గొడతా– కొడకా! నోర్మూసుకుని ఫో"

అందరికీ రక్తం కాగిపోతుంది కానీ మనదేశం పోలీస్ పరిస్థితి ఎక్కడయినా అలాపై చేయిగానే ఉందని గుర్తురావడంతో చేసేదేమీలేక ఇళ్ళకు బయల్దేరాము.

ఆ తరువాత మా అందరినీ బండ బూతులు తిడుతూ సర్కిల్ ఇనిస్పెక్టర్ కాలనీ మధ్యలో కాసేపు స్వైరవిహారం చేసి వెళ్ళిపోయాడు.

మర్నాడు పొద్దున్న ఓ పెద్ద పోలీస్ వాన్ వచ్చి మా కాలనీ మధ్యలో ఆగింది. అందులోనుంచి తుపాకులు తీసుకుని బోలెడుమంది పోలీసులు దిగి నిలబడ్డారు. రాత్రివచ్చిన

సర్కిల్ ఇన్‌స్పెక్టరూ, మా పోలీస్‌స్టేషన్ సబిన్‌స్పెక్టరూ రివాల్వర్ చేతిలోకి తీసుకుని మా ఇంట్లో కొచ్చారు.

"వీడే–" అన్నాడు సర్కిల్ నన్ను చూడగానే.

కానిస్టేబుల్స్ ఇద్దరు వచ్చి నన్ను రెక్కలు విరిచి పట్టుకున్నారు మరో కానిస్టేబుల్ ఓ పుస్తకం అతని జేబులోనుంచి తీసి నేను చూస్తుండగానే నా టేబుల్ మీదరకు విసిరేశాడు. వెంటనే సర్కిల్ వెళ్ళి ఆ పుస్తకం తీసి చూశాడు.

"ఆ! మావో సాహిత్యం! గవర్నమెంట్‌ని కూలదోయటానికి, భూస్వాములనందరినీ హత్య చేయడానికి కుట్ర!" అన్నాడు గట్టిగా.

మరి కాసేపట్లో గోపాల్రావ్‌నీ, రంగారెడ్డినీ, జనార్ధన్‌నీ, కాలనీ కవివిప్లవ జ్యోతినీ., రాజేశ్వరినీ కూడా అరెస్ట్ చేసి మా అందరితోపాటు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్ళారు.

గోపాల్రావ్ ఇంట్లో బాంబులు కూడా దొరికాయట!

"నా జన్మలో అసలు బాంబు ఎలావుంటుందో నేను చూళ్ళేదు! మా ఇంట్లో బాంబులుండట మేమిటి?" భయంతో అన్నాడు గోపాల్రావ్.

"ఇది అన్యాయం! అక్రమంగా మా మీద లేనిపోని నేరాలు మోపుతున్నారు" అంది రాజేశ్వరి కోపంగా.

"అక్రమమేం లేదు! మీ అందరిళ్ళల్లో మావోసాహిత్యం దొరికింది. ప్రభుత్వాన్ని కూలదోసేందుకు మీరు తయారుచేసిన పథకాలు దొరికాయి–" అన్నాడు సర్కిల్.

"మా ఇంట్లో ఏమీ దొరకలేదు కద్సార్– నన్నొదిలేయండి!" అన్నాడు విప్లవజ్యోతి దీనంగా.

"ఏమీ దొరకలేదా? ఎవడన్నాడూ? ఇదిగో! ఈగేయంనువ్ రాసిందేగా!"

"వేషగాళ్ళు మోసగాళ్ళు–

స్వార్థపరులు– బడాచోర్లు–

రక్తం పీల్చే జలగలు– దోపిడీదొంగలు

హంతకులు– వంచకులు

వీళ్ళ ఆటలు అరికట్టించండి

వీళ్ళందరినీ తుదముట్టించండి"

"అవున్సార్! నేనే రాసింది–"

''మరింకేమిటి? మన ప్రభుత్వాన్ని స్పష్టంగా వర్ణించావు! దానిని తుదముట్టించమంటున్నావు– మరిది ప్రభుత్వాన్ని కూలదోసెందుకు కుట్రకాదూ?"

"నేను వర్ణించింది ప్రభుత్వాన్నికాదు సార్! మన సమాజంలో ఉన్న చెడుని–"

“ఛట్! మాకామాత్రం తెలీదనుకోకు! సమాజంలో అంత చెడు లేనే లేదు. ఖచ్చితంగా నీవర్ణనంతా ప్రభుత్వానికే సరిపోతుంది–”

“బాబోయ్– దేవుడు సాక్షిగా చెప్తున్నాను! నేను ప్రభుత్వాన్ని దృష్టిలో ఉంచుకొని రాసింది కాదండీ! నన్ను నమ్మండి సార్! అలా రాస్తే పత్రికల వాళ్ళు వేసుకుంటున్నారని– అలాగే రాస్తున్నాను! అంతేకానీ నాకీకుట్రలూ, రాజకీయాలూ అస్సలు తెలీవు సార్!” కనీళ్ళు తుడిచేసుకున్నాడు, విప్లవకవి! మేమంతా ఆశ్చర్యపోయాం.

“నేను రాసే కవిత్వం వల్ల ఎప్పుడో ఒకప్పుడు దేశంలో విప్లవం వస్తుంది సార్” అంటూండేవాడు మాతో అతను సీరియస్‌గా.

మా కాలనీలో మిగతా వారంతా ఆడాళ్ళతో సహా క్రమేపీ పోలీస్‌స్టేషన్ దగ్గరకు చేరుకుంటూండడంతో సర్కిల్ ఇనస్పెక్టర్‌లో కలవరం కలిగింది.

లేచి మళ్ళీ మా దగ్గర కొచ్చాడు.

“అందరూ రాసివ్వండి! ఇంకెప్పుడే నగ్జలైట్ కార్యకలాపాల్లో పాల్గొనబోము. ప్రభుత్వానికి విధేయులమై ఉంటాము అని రాయండి– రాసిచ్చేవారినే వదిలేస్తాను”

“మేము రాయం! మాలో ఎక్కువమంది గవర్నమెంట్ సర్వెంట్స్‌మే ఉన్నాం. అసలు రాజకీయాలతోనే మాకు సంబంధంలేదు. అలాంటిది కావాలని మా ఇళ్ళలో బాంబులు, మావోఫోటోలు, సాహిత్యం మీరేపడేసి మమ్మల్ని నగ్జలైట్లంటారా?” ఆవేశంగా అన్నాడు రంగారెడ్డి.

“లేకపోతే పోలీస్‌లంటే వేళాకోళంగా ఉందా మీకు? మా వ్యవహారాల్లో మా “మామూళ్ళల్లో” మీరు తలదూర్చి అర్జీలు తయారుచేస్తారా మా మీద– ఇప్పుడు తెలిసిందా పోలీస్ అంటే ఏమిటో?” అడిగాడు కసిగా సర్కిల్.

“మిమ్మల్ని ఇక్కడ కాల్చినా గాని మమ్మల్ని అడిగేటోళ్ళు ఎవళ్ళూలేరు! ఎరుకనా?” అన్నాడు సబ్‌ఇనిస్పెక్టర్.

“అదేమంతా తేలిక కాదు! మమ్మల్ని కాల్చిచంపితే మీరు ఉరికంబమెక్కుతారు!” అన్నాడు గోపాల్రావ్.

“అరే పాగల్! మీ కాలనీ నగ్జలైట్లను అరెస్టు చేసినప్పుడు, లొంగకుండా ప్రతిఘటించినందుకు కాల్పులు జరిపినామనీ– ఆఫైరింగ్‌లో చచ్చిన్రనీ మేము పేపర్ స్టేట్‌మెంటిస్తాము– ఇంకెవడేం జేస్తాడుబే–”

అందరం సైలంటయి పోయాము. కొద్దిక్షణాలు అందరి గుండెల్లోనూ రైళ్ళూ, బస్సులూ పనిగెత్తినయ్. ఇనిస్పెక్టర్ చెప్పినమాట నిజమే.

మమ్మల్నందరినీ వాళ్ళు కాల్చిపారేసినా దిక్కులేదు. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోదు.

సివిల్ లిబర్టీస్ వాళ్ళేవరో వచ్చి– నిజం తెలుసుకుంటారని పేపర్లో చదివాము గానీ – అందువల్ల కాల్పుల్లో చచ్చిన అమాయకులు (అంటే–మేము) తిరిగి బ్రతకరుకదా! పైగా ఆ సివిల్ లిబర్టీస్ వాళ్ళ స్టేట్‌మెంట్స్ కూడా పట్టించుకొనే నాధుడు లేడు.

"అందరినీ వాన్‌లో ఎక్కించండి. ఇంటరాగేషన్‌కి తీసుకెళ్దాం–" అన్నాడు సర్కిల్.

మాకు చెయటలు పట్టేసినయ్.

ఇంటారాగేషన్‌కని అడవిలోకెక్కడికో తీసుకెళ్ళి– మమ్మల్ని కాల్చిపారేస్తారు. ఏమాత్రం అనుమానం లేదు. ఇంతకుముందు పేపర్లో చదివినవన్నీ ఇలాంటి ఎన్‌కౌంటర్లేనని మా అనుమానం.

"నేను రాసిచ్చేస్తాను" అన్నాన్నేను.

మిగతా అందరూ కూడా రాసిచ్చేయడానికి రడీ అయారు. సర్కిల్ ఇనస్పెక్టర్ మా వేపు విజయగర్వంతో చూశాడు. సబ్‌ఇన్స్‌పెక్టర్ మమ్మల్నందరినీ దీపం పురుగుల్ని చూసినట్లు జాలిగా చూశాడు.

అందరం వాళ్ళు చెప్పినట్లు రాసిచ్చి ఇళ్ళకు బయలుదేరాం.

ఆ రోజు నుంచీ కాలనీ చుట్టూ ఏ అఘాయిత్యాలు జరుగుతున్నా పట్టించుకోవటం మానేశాము.

కానీ కథ అక్కడితో ముగియలేదు.

వారం రోజులన్నాగడవక ముందే ఓ రోజు సాయంత్రం నిసార్, యాదగిరి మా ఇంటికి పరుగుతో వచ్చారు "దేఖో భాయ్!" అన్నాడు గాబరాగా నిసార్ "మనకాలనీ పిల్లల్ని పోలీసులు తీస్కపోయినయ్."

నేను ఆశ్చర్యపోయాను.

"ఎందుకని?"

"ఏమో! మూడు పిల్లలూ బయట ఆడుకుంటున్నాయ్. పోలీసులొచ్చి తీస్కపోయినయ్."

ముగ్గురం కలిసి మిగతా గాంగ్‌ని పోగేసుకుని స్టేషన్‌కి పరుగెత్తాం. మొత్తం కాలనీకి చెందిన నలుగురు పిల్లలను లాకప్‌లో పడేశాడు ఇన్‌స్పెక్టర్.

"నమస్కారం సార్!" అన్నాన్నేను.

"ఎవరునువ్?"

"నా పేరు ఉదయార్కర్ సార్! కాలనీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ని..."

"ఇగో– ఎక్కువ తక్కువ మాట్లాడకు! నువ్వెవళ్ళు అనడిగితే పేరు జెప్పు! గంతేనేగాని వైస్ ప్రెసిడెంట్, బైగన్‌కి ప్రెసిడెంట్– కరేకేబేకార్ మాటలు మాట్లాడకు! ఎందుకొచ్చినా వీడకు?"

"మా పిల్లలను మీరు స్టేషన్‌కి తీసుకొచ్చారని తెలసింది–"

"అవ్! తీసుకొచ్చినాం!"

"ఎందుకుసార్?"

"ఎందుకేమిటి? వాళ్ళు కొట్లాడుకున్నారు! అందుగురించి అరెస్ట్ చేసినాం."

"చిన్న పోరలు ఆటల్లో కొట్లాడుకున్నందుకు అరెస్ట్ చేసిన్రా?" ఆశ్చర్యంగా అడిగాడు యాదగిరి.

"బరాబర్ జేస్తా!"

"వాళ్ళు పోట్లాడుకోకుండా మేము చూస్తాములెండి! వదిలేయండి!" అన్నాన్నేను.

"ఇది మామూలు కొట్లాట కేసుగాదు! కమ్యూనల్ రైట్స్! సమజయిందా"

"కమ్యూనల్ రైట్సా?" అందరం ముక్తకంఠంతో నమ్మలేనట్లు అడిగాము.

"అవ్! ఈ పోరల్లో ఒక ముస్లిమ్, ఇద్దరు హిందూ, ఒక క్రిస్టియన్ ఉన్నారు. అందుకే వీళ్లకొట్లాట 'మతకలహం' కింద రిజష్టర్ చేసినా."

"అదేమిటి సార్! వాళ్ళు చిన్నపిల్లలు. ఆటల్లో కొట్లాడుకుంటారు– ఒకటవుతూంటారు. అది మామూలేగా."

"హా సాబ్! హమారే లోగేంమే– కభీభీ రెలిజియన్‌కి బాత్‌నహీ ఆతీ" అన్నాడు నిసార్!

"ఛలో– ఇంక బయటకు నడువుండ్రి" లేచి నిలబడ్డాడు ఇనిస్పెక్టర్ చేయి బయటకు చూపుతూ.

అందరం బయటకు నడిచాం. కానిస్టేబుల్ మా కోసమే ఎదుర్చూస్తున్నాడు బయట.

"ఈ కిరికిరంతా ఎందుకుసార్! నెలనెలా ఎంతోకంతిస్తూంటే మంచిగ నడిచిపోతది. మేముమీ జోలికి రాము– మీరు మా జోలికిరావద్దు! లేకుంటే గిట్లనే ఏదోక కేస్‌లో ఇరుక్కుని మీరు పైసలు కడుతూనే ఉండాలి. గిప్పుడు చూడండ్రి! ఈ పోరలు జబర్దస్తీల ఆటకాయించి పోయిన్రు! రెండువేల రూపాయలిస్తేగానీ ఈళ్ళను ఇడవనికి కాదు–"

అందరం భయంగా ఒకరిమొఖాలొకరు చూచుకున్నాం.

"రెండువేలా?"

"సాబ్! కమ్యూనల్‌కేస్ ఇది. బజర్దస్త్‌కేస్! చుపాయించెడిదే కష్టం, ఈకేస్‌ల! బరాబర్ జైలుశిక్ష పడతది."

"కాని వాళ్ళు చిన్నపిల్లలు కదా–"

"కమ్యూనల్‌కేస్‌కి చిన్నాపేద్దా ఏమీలేద్సార్– మనకాలనీ అని ఇన్‌స్పెక్టర్ సాబ్ కన్సెషన్

రేట్ చెప్పిండు. నిన్న గుడంబ దుకాణం దగ్గర జగడం అయితే ఆళ్ళిద్దరికీ నాలుగువేలు చార్జీవేసిండు– "చేసేదిలేక రెండువేలు కట్టి పిల్లలందరినీ విడిపించాము.

అప్పటికప్పుడే కాలనీ ఎమర్జెన్సీ సమావేశం ఏర్పాటు శాయిరామ్. చాలా రోజుల తరువాత జరిగిన మీటింగ్ అవటం వల్ల స్త్రీలు, పిల్లలు అంతా కిటకిటలాడి పోయారు.

"సోదర సోదరీమణులారా! ఇప్పుడు మన కాలనీకి కొత్త సమస్య ఎదురయింది. అదేమిటంటే మనం ఇటీవలే కోరి ఏర్పాటు చేసుకున్న మన పోలీస్‌స్టేషన్ వారికీ మనకూ మధ్య కొన్ని బాధాకరమయిన సంఘటనలు జరిగిన విషయం మీ అందరికీ తెలుసు. కనుక అలాంటి సంఘటనలు ఇకముందు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సభ్యులు సూచించవలసిందిగా కోరుతున్నాను–" అంటూ ముగించాడు శాయిరామ్.

అంతా కలవరం చెలరేగింది. కొద్ది నిమిషాల తర్వాత రాజేశ్వరి లేచి నిలబడింది.

"మా ఆడాళ్ళందరి అభిప్రాయం ఏమిటంటే– పోలీస్‌స్టేషన్‌ని మనకాలనీ నుంచి ఎత్తివేయాలని మనం మినిష్టర్‌గారికి అర్జీపెట్టాలని!" అంతా తప్పట్లు మార్మోగిపోయినయ్.

"అవునూ! పోలీస్‌స్టేషన్ వద్దు– పోలీస్ స్టేషన్ వెంటనే ఎత్తివేయాలీ" అంటూ అరిచారు విద్యార్థులు వెనుకనుంచీ!

కాలనీ వారందరం కలసి మంత్రిగారి దగ్గరకు ఊరేగింపుగా వెళ్ళి పోలీసుస్టేషన్ ఎత్తివేయాలన్న మెమొరాండం సమర్పించాలని నిర్ణయించారు చివరకు.

"కానీ సోదరులారా! పోలీస్‌స్టేషన్ ఎత్తివేయటం అంటే అంత తేలిగ్గా జరిగే విసయంకాదు. చాలాటైము పట్టవచ్చు. కాని అంతవరకూ పోలీసుల బారినుండి మనం మన కాలనీని రక్షించుకోవాలంటే ప్రతినెలా కొంత మామూలు ఇవ్వాల్సి ఉంటుంది. సభవారంతా వప్పుకున్నట్లయితే– మనకాలనీ ఫండ్స్ నుంచి వారికి మామూలు ఇవ్వటం ప్రారంభిస్తాము–"

"అంటే– అదివరలో ఆ దొంగలతో రాజీకుదుర్చుకుని వారికి నెలనెలా మామూలు ఇస్తున్నట్లే– ఇప్పుడే పోలీసులకూ నెలనెలా మామూళ్ళిచ్చి రాజీ కుదుర్చుకుంటారా?" ఎవరో అడిగారు.

అదే రోజు ఇద్దరు కానిస్టేబుల్స్ మా కాలనీలోనే ఉంటూన్న గాళ్ స్టూడెంట్ దివ్యనూ ఆమె బాయ్‌ఫ్రెండ్ భరత్‌ని అరెస్ట్ చేశారు.

మళ్ళీ అందరం పోలీస్‌స్టేషన్‌కెళ్ళక తప్పలేదు.

"ఆ అమ్మాయినెందుకు అరెస్ట్ చేశారు" సబ్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగాము.

"నేరం జేస్తే అరెస్ట్ జేస్తాం! వూరుకుంటామా?"

"ఏం నేరం జేసింది?"

"ఇమ్మోరల్ ట్రాఫిక్ కింద బుక్ చేసినాం."

అందరం ఉలిక్కిపడ్డాం.

"ఇమ్మోరల్ ట్రాఫిక్కా? నీకేమయినా దమాకుందా? ఫామిలీగాళ్, కాలేజ్‌స్టూడెంట్– ఆ అమ్మాయి మీద అలాంటి కేసా?"

"ఏయ్– ఎక్కువ తక్కువ మాట్లాడకండ్రి! లోపటవుతారు– ఆ అమ్మాయి వాడెవడో విటుడిని తీసుకుని కాలనీ చివర పార్కులో చెట్లచాటున ప్రేమ కలాపాలు చేస్తున్నది. ఎరుకనా?"

"వాడెవడో కాదయ్యా! భరత్! ఆ అమ్మాయికి రెండేళ్ళనుంచీ బాయ్‌ఫ్రెండ్! ఇద్దరూ మారేజ్ కూడా చేసుకోబోతున్నారు–"

"గదంతా కోర్టులో ప్రొడ్యూస్ జేసినాంక జడ్జ్‌కి చెప్పండ్రి!"

దివ్య తల్లిదండ్రులు గాబరా పడిపోయారు.

"కోర్టులో కెళితే ఇంకెమయినా వుందా? జన్మలో మా దివ్య తలెత్తుకు తిరగలేదు–"

కానిస్టేబుల్ మళ్ళీ మా దగ్గరకొచ్చాడు.

అతనడక్కుండానే మేమే అడిగేశాం– "ఎంత కట్టాలి?"

"రెండువేలు"

మాట్లాడకుండా డబ్బుకట్టి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయాం.

"అవును! అయితే దొంగల్తో మనము అగ్రిమెంట్ రాసుకున్నట్లు పోలీసుల్తో అగ్రిమెంటు రాయడం కుదరదు. అలా అని సర్కిల్‌గారు చెప్పారు. కేవలం నోటిమాటే నమ్మకం!"

ఆ తీర్మానాన్ని సభ వెంటనే ఆమోదించింది.

ఆ తరువాత ఆదివారమే కాలనీ అంతా మంత్రిగారి దగ్గరకు వెళ్ళడానికి కూడా నిర్ణయం తీసుకున్నాక అందరం నిర్భయంగా ఆనందంగా నిట్టూర్చాం!

